# ఫినిష్ ఆంధ్రా యూనిట్లు!

- మూత పడుతున్న రిటైల్ దుకాణాలు
- పాన్ షాపులు, ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్లుగా మార్పు
- ఫిట్ ఆంధ్రా లక్ష్యానికి తూట్లు



కాకినాడ ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్‌గా మారిన ఫిష్ ఆంధ్ర యూనిట్

కాకినాడ రూరల్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన ఫిష్ ఆంధ్ర మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. చేపల వినియోగాన్ని పెంచేందుకు, ఉపాధి కల్పనకు ఫిష్ ఆంధ్ర.. ఫిట్ ఆంధ్ర నినాదంతో నిత్యం తాజా చేపలను హోల్ ధరలకే రిటైల్‌గా విక్రయించేందుకు వాటిని ప్రోత్సహించారు. నేడు కూటమి సర్కార్ నిర్లక్ష్యంతో వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. చాలా చోట్ల యూనిట్లు మూత పడగా, కొన్ని చోట్ల ఇతర అవసరాలకు పాన్ షాపులు, కిరాణా బడ్డీలు, ఆన్‌లైన్ సర్వీసు సెంటర్లుగా మారిపోతున్నాయి.

దేశంలో అత్యధిక మత్స్య సంపద గల మన రాష్ట్రంలో చేపల తలసరి వినియోగం ఏడాదికి 7 కేజీలు మాత్రమే ఉండడంతో బలవర్ధమైన ఆహారంగా చేపలతో అనేక రుచికరమైన వంటలను వినియోగంలోకి తీసుకువచ్చి తద్వారా 30 కేజీలకు వినియోగాన్ని పెంచేందుకు గత రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ సేల్ అవుట్ లెట్లను ప్రోత్సహించింది. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం కింద జిల్లాలో మినీ ఫిష్ రిటైల్ అవుట్ లెట్లతో పాటు వేల్యూ యాడెడ్ యూనిట్లను మంజూరు చేసింది. అప్పట్లో జిల్లాలో 250 మినీ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లు నెలకొల్పే లక్ష్యంగా మత్స్యశాఖ అధికారులు అడుగులు చేయగా ఒక్కో యూనిట్‌కు రూ.1.7 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.3.2 లక్షల వరకు అందజేశారు. వీటిలో జనరల్, బీసీలకు 40 శాతం, మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు 60 శాతం చొప్పున సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందివ్వగా లబ్ధిదారుడు 15 శాతం వాటా జమ చేయగా మిగిలిన మొత్తాన్ని బ్యాంకులు రుణాలుగా అందించాయి. కాకినాడ నగరం, పరిసర గ్రామాలతో పాటు పలు చోట్ల యూనిట్లు ఏర్పాటయ్యాయి. అయితే పూర్తి స్థాయిలో అధికారులు వాటిని నిర్వహించలేకపోయారు. ఉన్న యూనిట్లను ప్రోత్సహించాల్సిన మత్స్యశాఖ అధికారులు పట్టనట్టు వదిలివేయడంతో వారికి తాజా చేపలు అందుబాటులో లేక చాలా చోట్ల మూసివేశారు. కాకినాడ నాగమల్లితోట జంక్షన్ నుంచి ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ఆనుకుని రోడ్డుపక్కన ఏర్పాటు చేసిన ఒక యూనిట్ ప్రస్తుతం ఆన్‌లైన్ సర్వీసుగా మారిపోయింది. పక్కనే ఉన్న మరో యూనిట్ పచ్చళ్ల, ఇతర సరకుల విక్రయాలకు పరిమితమైంది. యూనిట్ల ఏర్పాటు కోసం కంటైనర్ బాక్స్‌లను ఏర్పాటు చేసుకునేందుకు అప్పట్లో విలువైన ప్రాంతాలలో రోడ్డు పక్కన అభ్యంతరాలు కలగకుండా అధికారులు ప్రోత్సహించారు. ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఫిష్ ఆంధ్ర యూనిట్ల ద్వారా కేవలం నిరుద్యోగులకు ఉపాధి మాత్రమే కాదు.. మత్స్యకారులు తమ సరుకును అమ్ముకునేందుకు వీలయ్యేది.



కాకినాడ తీరంలో లభ్యమయ్యే చందువా తాజా చేపలు

### ఇతర అవసరాలకు వాడుతున్న సమాచారం లేదు



తాజా చేపలు హోల్ సేల్ రేట్లకే రిటైల్‌గా విక్రయించేందుకు ఫిష్ ఆంధ్ర యూనిట్లు పెట్టారు. ప్రస్తుతం కొత్త యూనిట్లు లేవు. గతంలో ఇచ్చిన యూనిట్లు కొనసాగుతున్నాయి. వాటికి సబ్సిడీతో కూడిన రుణాలు బ్యాంకర్ల సహకారంతో గతంలో ఇచ్చారు. ఇప్పుడు అవి ఇతర అవసరాలకు వాడుతున్నట్లు తమ దృష్టికి రాలేదు. అలా వస్తే వెళ్లి ఆయా యూనిట్ల నిర్వాహకులను కొనసాగించేలా ప్రయత్నం చేస్తాం.

– కృష్ణారావు, మత్స్యశాఖ అధికారి, కాకినాడ జిల్లా

## క్లుప్తంగా

### ఘనంగా స్నేహితుల దినోత్సవం

కరప: మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఒకరినొకరు కలుసుకుని ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. వాట్సప్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా ఫోన్లలో శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. యువకులు ఉత్సాహంగా, ఉల్లాసంగా మోటార్‌సైకిళ్లపై తిరుగుతూ స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు చెపుతూ సందడి చేశారు. గ్రామాల్లోని మామిడితోటల్లోకి వెళ్లి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ గడిపారు.

### ఘనంగా శ్రీ యువసేన వార్షికోత్సవం



విరాళం చెక్కును అందజేస్తున్న శ్రీహర్ష. చిత్రంలో డాక్టర్ బొల్లం సతీష్ తదితరులు

కాకినాడ క్రైం: స్థానిక శ్రీ యువసేన స్వచ్ఛంద సేవా సంస్థ 12వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. కల్పన సెంటర్‌లోని సూర్యకళామందిర్ హాల్‌లో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బొల్లం సతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 350 మంది రక్తదానం చేశారు. అలాగే కొమ్మిశెట్టి శ్రీహర్ష మిత్రబృందం చిన్నారుల చదువుల కోసం రూ.7.33 లక్షల విరాళాన్ని బొల్లం సతీష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నలుగురు విద్యార్థులకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వనమాడి, చినరాజప్ప, పంతం నానాజీ తదితరులు పాల్గొన్నారు.

### త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం

కరప: మండలం పెనుగుదురు పీఏసీఎస్ కార్యాలయానికి త్రిసభ్య కమిటీ నియామకం జరిగింది. ఆ సంఘ కార్యాలయంలో ఆదివారం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ పర్సన్ ఇన్‌చార్జిగా ఆ గ్రామ మాజీ సర్పంచ్ రెడ్డిపల్లి నారాయణరావు, డైరెక్టర్లుగా సింగంపల్లి నాగేశ్వరరావు, గుత్తుల కృష్ణమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

### కాకినాడ అధికారుల ఫోన్ నంబర్లు

| | |
|---|---|
| **మున్సిపల్ అధికారులు** | |
| కమిషనర్ | 9100945696 |
| అదనపు కమిషనర్ | 9849907096 |
| డిప్యూటీ కమిషనర్ | 9949921555 |
| ఏసీపీ | 9989743049 |
| ఎంహెచ్‌వో | 9949432320 |
| ఎస్ఈ | 9959988639 |
| మేనేజర్ | 7093519888 |
| టీపీఆర్వో | 9701385284 |
| అకౌంట్ ఆఫీసర్ | 9849907084 |
| సిటీ మిషన్ మేనేజర్ | 7901610084 |
| **పంచాయతీ అధికారుల ఫోన్ నెంబర్లు** | |
| డివిజనల్ పంచాయతీ అధికారి | 9849903188 |
| ఫుడ్ ఇన్‌స్పెక్టర్ | 9494297564 |
| ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ | 9100121109 |
| జిల్లా వ్యవసాయశాఖాధికారి | 8331056483 |
| దేవదాయశాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ | 9290145126 |
| గృహ నిర్మాణశాఖ డీఈ | 7093930577 |
| పశుసంవర్ధకశాఖ జేడీ | 9989932835 |
| డీసీసీబీ జీయం | 8341208227 |
| జిల్లా సహకారశాఖ అధికారి | 9100109168 |
| **జీజీహెచ్‌లో ముఖ్యమైన ఫోన్ నంబర్లు** | |
| సూపరింటెండెంట్ | 98499 03870, 0884 2302001 |
| సీఎస్ ఆర్ఎంవో | 98499 03871 |
| డీసీఎస్ ఆర్ఎంవో | 98499 03871 |
| ఆర్ఎంవో | 0884 2302003 |
| డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్ | 0884 2302002 |
| అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) | 98499 03873, 0884 2302004 |
| పోలీస్ అవుట్‌పోస్ట్ | 83329 57924 |
| అత్యవసర విభాగం | 0884 2302021 |
| బ్లడ్ బ్యాంక్ | 0884 2302009 |
| మెడికల్ రికార్డ్స్ సెక్షన్ (ఎంఆర్‌డీ) | 0884 2302018 |

### కరప మండల అధికారుల ఫోన్‌నంబర్లు

| | |
|---|---|
| ఎంపీడీఓ | 9346790819 |
| తహసీల్దార్ | 9849903908 |
| ఈఓ పీఆర్ ఆర్డీ | 9849352293 |
| మండల ఇంజనీరింగ్ అధికారి | 8886865417 |
| మండల వ్యవసాయాధికారి | 8331056589 |
| ఎంఈఓ-1 | 8008293994 |
| ఎంఈఓ-2 | 8919940656 |
| హౌసింగ్ ఏఈఈ | 7093930450 |
| ఉపాధిపథకం ఏపీఓ | 7093998259 |
| వెలుగు ఏపీఓం | 9959989273 |
| ఎలక్ట్రికల్ ఏఈ | 9440812638 |
| ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ | 9603007219 |
| ఇరిగేషన్ ఏఈఈ | 9704651826 |
| డ్రెయినేజ్‌శాఖ ఏఈఈ | 9963744219 |
| ఆర్అండ్‌బి ఏఈఈ | 9440818530 |
| కరప పీహెచ్‌సీ డాక్టర్ | 8096940176 |
| వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ | 9962553545 |
| పశుసంవర్ధకశాఖ ఏడీఏ | 9490047668 |
| నడకుదురు వెటర్నరీడాక్టర్ | 9652547579 |
| వేళంగి వెటర్నరీ డాక్టర్ | 8332973558 |
| అరట్లకట్ట వెటర్నరీ డాక్టర్ | 9494671642 |
| ఫిషరీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ | 9704512131 |

### పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



రూ. 30 వేల విరాళం చెక్కును అందజేస్తున్న సఖి క్లబ్ సభ్యులు

కాకినాడ సిటీ: పర్యావరణ పరిరక్షణకు మహిళలు నడుము బిగించాలని లయన్స్ పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. ఆదివారం కాకినాడ శ్రీరామ్‌నగర్‌లోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో లయన్స్ క్లబ్ సఖి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలిథిన్ కవర్లను నిషేధించి క్లాత్ బ్యాగులను ఉపయోగించాలని బాలకృష్ణ పిలుపునిచ్చారు. డ్వాక్రా మహిళలచే పాలిథిన్ బ్యాగులు ఉపయోగించబోమని ఆయన ప్రతిజ్ఞ చేయించారు. అన్నపూర్ణ స్పాన్సర్ చేసిన క్లాత్‌బ్యాగులను ఆయన డ్వాక్రా మహిళలకు పంపిణీ చేశారు. అలాగే సఖి క్లబ్ ట్రెజరర్ మంగా కాశీ అన్నపూర్ణ రాజమండ్రిలో నిర్మిస్తున్న లయన్స్ మల్టీపుల్ ట్రైనింగ్ సెంటర్‌కు రూ.30 వేలు విరాళం చెక్కును డాక్టర్ బాలకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ సఖి అడ్మిన్ నూలు నాగలక్ష్మి, రీజనల్ చైర్మన్ దేవత పుత్రరావు, జీఎంటీ పద్మతులసి, డీసీ రత్నమాల, క్లబ్ ప్రెసిడెంట్ సునీత, సెక్రటరీ సావిత్రి, ట్రెజరర్ రమణమ్మ, పద్మ, బాదం కుసుమ తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ అధ్యయనానికి దిక్సూచి ఆరుద్ర రచనలు

- సాహితీవేత్త జోస్యుల కృష్ణబాబు
- ఘనంగా మహాకవి జయంత్యుత్సవం



ఆరుద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు

బోట్‌క్లబ్: సాహితీ స్రవంతి కాకినాడ నగరశాఖ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీభవన్‌లో ప్రముఖ సాహితీవేత్త ఆరుద్ర శతజయంతి సభ నిర్వహించారు. తొలుత ఆరుద్ర చిత్రపటానికి సాహితీ ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జోస్యుల కృష్ణబాబు మాట్లాడుతూ ఆరుద్ర రాసిన 'సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర' తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేసేవారికి ఎంతో ఉపయుక్తమైన గ్రంథమని పేర్కొన్నారు. ఎంపీ భారతలక్ష్మి మాట్లాడుతూ ఆరుద్ర సాహిత్యం, ఆయన వ్యక్తిత్వం, వారి కుటుంబంతో దాదాపు నాలుగైదు దశాబ్దాల సాన్నిహిత్యాన్ని ఆమె తెలియజేశారు. రెంటాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బహుముఖీయమైన సాహిత్య ప్రక్రియలు అన్నింటిని ఆరుద్ర స్పృశించారన్నారు. ఆరుద్ర గురించి చెప్పాలంటే జిజ్ఞాస, వివేచనలకు మార్క్సిజం కలిపితే ఆరుద్రగా పేర్కొన్నారు. సాహితీ స్రవంతి నగరాధ్యక్షుడు మార్ని జానకిరామ చౌదరి ఆరుద్ర సాహిత్య విశేషాలు తెలియజేశారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు విశ్వనాథరావు, అద్దేపల్లి ప్రభు, వి.హనుమంతరావు, గనారా, గౌరీనాయుడు, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

### నేడు పీజీఆర్ఎస్

కాకినాడ సిటీ: కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ జరుగుతుంది. జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. దీనికి జిల్లా అధికారులందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి రాలేని వారు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీల నమోదు స్థితికి సంబంధించిన సమాచారానికి 1100 నంబరుకు కాల్ చేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

### జగ్గంపేట వచ్చిన కాకినాడ కింగ్స్ టీం

జగ్గంపేట: విశాఖపట్నంలో జరిగే ఆంధ్రా ప్రీమియర్ లీగ్ పోటీల్లో కాకినాడ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ కింగ్స్ టీం ఆదివారం జగ్గంపేట వచ్చారు. టీం కెప్టెన్ భరత్ ఆధ్వర్యంలో కాకినాడ కింగ్స్ టీం విజయం సాధించాలని కోరుతూ స్థానిక నేతలు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. టీం సభ్యులను శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం కెప్టెన్ భరత్ మాట్లాడుతూ, తన పూర్వీకులది జగ్గంపేట నియోజకవర్గమని, అందుకే ఇక్కడి నేతల ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చామని చెప్పారు.

### ఐదుగురు జూదరుల అరెస్టు

- ఇందులో ఒకరు దేవస్థానం ఉద్యోగి

అన్నవరం: స్థానికంగా ఓ లాడ్జిలో పేకాడుతున్న ఐదుగురిని అన్నవరం పోలీసులు పట్టుకున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందులో ముగ్గురు స్థానిక వ్యాపారులు, ఒక దేవస్థానం ఉద్యోగి, మరో వ్యక్తి కలిసి దేవస్థానం హైస్కూల్ సమీపంలోని లాడ్జిలో పేకాడుతుండగా శుక్రవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.40 వేలు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. వారిపై కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. అయితే రాజకీయ ఒత్తిడితో వారి పేర్లు పోలీసులు గోప్యంగా ఉంచారు.

## జర్నలిస్టులకు ఉచిత కంటి పరీక్షలు



డాక్టర్ శ్రీరామ్, సిబ్బందికి జ్ఞాపికలు అందజేస్తున్న కాకినాడ సిటీ ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

కాకినాడ సిటీ: స్థానిక ప్రెస్‌క్లబ్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు నయన కంటి ఆస్పత్రిలో ఉచిత నేత్ర పరీక్షలు చేసినట్టు కాకినాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి డి.మోహన్ వెల్లడించారు. ఆదివారం వారు నయనా ఆసుపత్రిలో విలేకర్లతో మాట్లాడారు. నయన కంటి ఆస్పత్రి ఆవరణలో డాక్టర్ రావుల శ్రీరామ్ పర్యవేక్షణలో వైద్యులు రావుల మెహర్ తేజ్, ఆర్.రమ్య, కార్తీక్ బృందం వంద మంది జర్నలిస్టులకు, వారి కుటుంబ సభ్యులకు వివిధ రకాల కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు, శస్త్ర చికిత్సలకు సూచించారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి వీహెచ్ఎస్ ద్వారా తన ఆసుపత్రిలో ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. ఎవరూ కంటి విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుంటూ తగ జాగ్రత్తలు తీసుకుని తమ చూపును కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు చైతన్య, షేక్ చిష్టి, ఆకెళ్ల శ్రీనివాస్, గుండు శ్రీనివాస్, అంజిబాబు, ఎస్.శివన్నారాయణరెడ్డి, కొమ్మిరెడ్డి శ్రీధర్, రాందాస్, హాసన్, మంగ వెంకట శివరామకృష్ణ, సతీష్ బన్నీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులను వారి సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మాతరాజు, సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తైక్వాండోతో స్వీయ రక్షణ



క్రీడాకారులకు మెడళ్లు, సర్టిఫికెట్లు అందజేస్తున్న వైడీ రామారావు తదితరులు

కాకినాడ రూరల్: తైక్వాండోలో శిక్షణ పొందడం ద్వారా ఆరోగ్యంతో పాటు స్వీయ సంరక్షణ కలుగుతుందని రాష్ట్ర రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు పేర్కొన్నారు. ఇటీవల విజయవాడలో చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన పదో జాతీయ ఓపెన్ చాంపియన్ షిప్ పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బోట్‌క్లబ్ ఉద్యానవనంలో ఆదివారం మెడల్స్, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు కాకినాడ నగరం ఒక వేదికగా రూపొందుతోందన్నారు. హాకీ జాతీయ స్థాయి క్రీడా పోటీలు కాకినాడలో జరగడం ఇందుకు నిదర్శమన్నారు. కోచ్ సతీష్ మాట్లాడుతూ తమ పరిమళ ట్వికాండో క్లబ్ ద్వారా 23మంది పోటీలలో పాల్గొనగా 8 మంది స్వర్ణం, ఏడుగురు రజతం, నలుగురు కాంస్య పథకాలు సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ దాసరి శ్రీధర్, రేలంగి బాపిరాజు, ధర్మచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులు మూసేయాలని నిరసన





బెల్టు షాపులు నిర్మూలించాలని నిరసన తెలుపుతున్న నాయకులు

గోకవరం: నిరుపేద కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న బెల్టు షాపులను తక్షణమే మూసివేయాలని ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని రంపయర్రంపాలెం గ్రామంలో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బెల్టు షాపులపై నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యం నిషేధిస్తామని హామీ ఇచ్చి వాటిని కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని విమర్శించారు. గ్రామాల్లో వీధికి ఓ బెల్టు షాపు ఉన్నా.. చూసీ చూడనట్టు అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో నిరుపేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్న జ్ఞానం లేదని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిల్లా వ్యాప్తంగా ఉన్న బెల్టు షాపులు మూసివేసి, ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ విజ్ఞంభణ రాష్ట్ర కార్యదర్శి సతీష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి ముత్యాలమ్మ జాతర

గోకవరం: మండలంలోని పెంటపల్లి గ్రామదేవత ముత్యాలమ్మ జాతర సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఐదు రోజులపాటు జరిగే జాతర మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జాతరలో మూడో రోజు అమ్మవారి ఊరేగింపు, నాల్గవ రోజు గ్రామంలోని ఆడపడుచులతో బోనాల సమర్పణ, ఈనెల 10 అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

# చేరువనే నీరున్నా.. చెరువంత నిర్లక్ష్యం!

- గోదావరి నీరు వచ్చినా ఫిల్టర్ చెరువు నింపని వైనం
- అడుగంటిన నీటితో శుద్ధీకరణకు అవరోధం
- తాగునీటి సమస్యతో పట్టణ ప్రజలు సతమతం
- బోరు నీటి సరఫరాకు చర్యలు



ఫిల్టర్ చెరువు అడుగంటి నాచురంగులో ఉన్న నీరు



గోదావరిలో పారుతున్న బురద నీరు



ఫిల్టర్ ప్లాంట్‌లోని బోరు

సామర్లకోట: గోదావరి కాలువకు నీరు వచ్చిన తరువాత ఫిల్టరు చెరువును నింపకపోవడం వల్ల పట్టణంలో తీవ్రమైన తాగునీటి సమస్య ఏర్పడింది. ఫిల్టర్ చెరువులో ప్రస్తుత నీటి మట్టం 1.89 మీటర్లు ఉండి నాచు రంగులో ఉంది. పట్టణ ప్రజలకు 15 రోజులుగా మున్సిపల్ కుళాయిల నుంచి బురద నీరు, కొన్ని వార్డులకు నాచు రంగులోను తాగునీరు వస్తున్న విషయం తెలిసిందే. 10 రోజుల క్రితం వర్షాలు కురవడంతో గోదావరి కాలువ నీరు బురదమయమైపోయింది. దాంతో ఆ నీటిని శుద్ధి చేసే సామర్థ్యం ఫిల్టర్ బెడ్‌కు లేకపోవడంతో ఆ నీరే ప్రజలకు వెళ్లిపోతోంది. గోదావరి కాలువకు నీరు వచ్చిన తరువాత నాలుగు రోజుల పాటు నీటిని సముద్రంలోనికి విడిచి పెట్టిన తరువాత గోదావరి కాలువ నీటిని ఏటా ఫిల్టర్ చెరువులోనికి నింపేవారు. గోదావరి కాలువకు నీరు విడుదల చేసి సుమారు రెండు నెలలు పూర్తయినా ఇప్పటి వరకు ఫిల్టర్ చెరువులో ఎందుకు నీరు నింపలేదన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి. చెరువు నింపక పోవడం, గోదావరి కాలువ బురదగా మారడంతో పట్టణ ప్రజలకు బోరు నీరే శరణ్యం అయ్యే అవకాశం ఉంది.

సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో సుమారు 12 వేల గృహావసర కుళాయి కనెక్షన్లు ఉండగా 30 వరకు పబ్లిక్ కుళాయిలు ఉన్నాయి. వీటిలన్నిటికీ మున్సిపాలిటీ సరఫరా చేసే బురద నీరు, నాచనీరు వస్తోంది.

ఫిల్టర్ చెరువు ఏర్పాటు చేసి సుమారు 50 ఏళ్లు అవుతోంది. అప్పటి నుంచి చెరువులో పూడిక తీయకపోవడం వల్ల 1.50 మీటర్ల వరకు పూడిక ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మూడు మీటర్ల వరకు నీటిని పూర్తిగా నింపితే నీటి ఎద్దడి ఉండదని సిబ్బంది చెప్తున్నారు. ఈ చెరువులో నీటిని పూర్తిగా తోడించి చెరువులో పూడికను పూర్తిగా తీసి వేయాలని అధికారులు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే మున్సిపల్ అధికారుల నిర్ణయాన్ని అజెండా అంశంగా పొందుపరచి కౌన్సిల్ అంగీకారం పొందాల్సి ఉంది. పూడిక తొలగింపునకు సుమారు రూ.రెండు కోట్ల వరకు ఖర్చు అవుతుందనే అంచనా వేస్తున్నారు. ఈ చెరువు నాగార్జున ఫ్యాక్టరీకి ఎక్కువ భాగం వాటా ఉండటంతో ఆ కంపెనీ ఖర్చు భరించేలా చూడాలని అధికారులు భావిస్తున్నారు. కాగా ప్రస్తుతం పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు నీరు ఇవ్వాలని నిర్ణయించి ఆదివారం నుంచి ఆ నీటిని అధికారులు సరఫరా చేస్తున్నారు.

### కలెక్టర్‌కు చెప్పి సమస్య పరిష్కరించాలి



పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉంది. దీని కోసం ఎంత ఖర్చు అయినా భరించాలి. తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా చూడాలి. సుమారు 12 ఏళ్ల క్రితం ఫిల్టర్ చెరువులో పూడిక తీయాలని నిర్ణయించి వాయిదా వేశారు. ఇప్పటికైనా పూడిక తీయించాలి. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి గోదావరి జలాలు పైప్‌లైన్ ద్వారా నేరుగా ఫిల్టర్ ప్లాంటుకు సరఫరా అయ్యే చర్యలు తీసుకోవాలి.

– ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్, సామర్లకోట

### బోరు నీరు ఇస్తున్నాం



ఫిల్టర్ బెడ్‌లో ఉన్న నాలుగు బోర్లతో పాటు, పట్టణ పరిధిలోని 13 బోర్లను ఉపయోగించి ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా నీటిని సరఫరా చేస్తాం. గోదావరి కాలువలో నీరు బురద రంగులో ఉండడం వల్ల ఫిల్టర్ బెడ్ నుంచి నీరు శుద్ధి కావడం లేదు. గోదావరి కాలువ వచ్చిన వెంటనే చెరువు నింపడానికి ఇరిగేషన్ అధికారులు అనుమతి ఇవ్వలేదు. ఇప్పటి వరకు గోదావరి నీరు బైపాస్ ద్వారా శుద్ధి చేసి ఇచ్చాం. దాంతో నీరు బురదగా వస్తోందని పలువురు కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు. చెరువులో నీటి మట్టం తక్కువగా ఉండటం వలన ఫిల్టరు ప్లాంటుకు అందడం లేదు.

– నరసింహారావు, మున్సిపల్ ఏఈ, సామర్లకోట

### పంచారామ క్షేత్రంలో డీఆర్ఎం పూజలు



డీఆర్ఎంకు ఆశీర్వచనాలు అందజేసిన వేదపండితులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో డీఆర్ఎం మోహిత్ సోమకియా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కాలభైరవ స్వామి, ధ్వజస్తంభం, పెద్ద నంది, ఉప ఆలయాలు, మూలవిరాట్, స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం పండితులు ఆశీర్వచనాలు చేసి ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట సామర్లకోట స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, ఏడీఈ ఎస్ శివప్రసాద్‌లు ఉన్నారు. కాకినాడ రైల్వే స్టేషన్ తనిఖీ సందర్భంగా ప్రత్యేక రైలులో సికింద్రాబాద్ నుంచి కాకినాడ వెళ్లారు. అక్కడి నుంచి పంచారామ క్షేత్రానికి వచ్చారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కాకినాడ పోర్టు, టౌన్ స్టేషన్లను తనిఖీ చేసి ప్రత్యేక రైలులో తిరిగి సికింద్రాబాద్ వెళ్లినట్లు స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు.

### పేకాడుతున్న ఇద్దరి అరెస్టు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆదివారం పేకాడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. చేబ్రోలు గ్రామ శివారులో బహిరంగ ప్రదేశంలో పేకాడుతున్నారన్న సమాచారంతో వెళ్లి దాడి చేసి సిద్ధ రాంబాబు, షేక్ రహీం బాబు అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2400 నగదును 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారిపై గొల్లప్రోలు ఎస్సై ఎం.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.